క్లుప్తంగా

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల



పోలేరమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మద్దిపూడి: మండలంలోని పొట్టిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం పోలేరమ్మ తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉప్పుటూరి రమణయ్య అమ్మవారిని, పోతురాజు విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.



ఆలయం వద్ద టెంకాయలు కొడుతున్న భక్తులు

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత

చీమకుర్తి: కారుమంచి అశోక్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి చేతుల మీదుగా ఆదివారం సంతనూతలపాడులో బహుమతులు అందజేశారు. సంతనూతలపాడు అంబేడ్కర్ యూత్ ఫోర్స్ పర్యవేక్షణలో గత నెల 24 నుంచి ఆదివారం వరకు నిర్వహించిన ఈ పోటీలలో 50 జట్లు వరకు పాల్గొన్నాయి. వాటిలో మొదటి బహుమతిని సంతనూతలపాడు రైజింగ్ స్టార్ గెలుచుకుంది. ద్వితీయ బహుమతిని అంబేడ్కర్ క్లబ్, మూడో బహుమతిని ఒంగోలు కొల్లాస్ జట్టు గెలుచుకుంది. మొదటి బహుమతిగా రూ.18,116ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ద్వితీయ బహుమతిగా రూ.12,116ని సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, తృతీయ బహుమతిగా రూ.7,116ను కారుమంచి రమణయ్య స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దుంపా రమణమ్మ, దుంపా యలమందారెడ్డి, ఎంఎస్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డీవీ రమణారెడ్డి, గోపీకృష్ణారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా చండీయాగం

ఒంగోలు టౌన్: నగరంలోని మిలటరీకాలనీ యానాది సంగంలో వెలసిన పోలేరమ్మ, కనకదుర్గమ్మ దేవస్థానంలో ఆదివారం అత్యంత వైభవంగా చండీయాగం నిర్వహించారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని అర్చక స్వాములు సుధీర్‌కుమార్, రాముశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, కలశపూజ, దీక్షా హోమం, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. అనంతరం మంగళహారతులతో భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. ఈ యాగంలో వేదపురోహితులు దండిభట్ల శ్రీనివాసశాస్త్రి, ఆలయ నిర్వాహకులు నాగూర్‌వలి పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై ముప్పేట దాడి

కొండపి/టంగుటూరు/మద్దిపూడి: కొండపి నియోజకవర్గంలో పేకాట శిబిరాలపై పోలీసులు ఆదివారం ముప్పేట దాడి చేసి పలువురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. కొండపి మండలంలోని ముప్పవరం గ్రామ పొలాల్లో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.26,760 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై వైవీ రమణయ్య తెలిపారు.

టంగుటూరులోని పడమర పోతుల చెంచయ్య కాలనీలో పేకాట శిబిరంపై ఎస్సై ఖాదర్‌బాషా తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.13,965 నగదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వడ్డెపాలెం శివారులో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.6,900 నగదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై చెప్పారు.

సింగరాయకొండ మండలం శానంపూడిలో గృహాల మధ్య నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.3,500 నగదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్సై ఫిరోజ్ ఫాతిమా తెలిపారు.

మద్దిపూడి మండలంలోని జువ్విగుంట, వేమవరం గ్రామాల శివారులో పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. జువ్విగుంటలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.9,390 నగదు స్వాధీనం చేసుకున్నారు. వేమవరంలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.5,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై పి.అంకమ్మరావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కేఆర్ జెడ్పీ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

లింగసముద్రం: స్థానిక కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987–92 విద్యా సంవత్సరాలలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక పాఠశాలలో జరిగింది. 30 సంవత్సరాలకుపైగా ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న 50 మంది విద్యార్థులు పాల్గొని ఆత్మీయంగా గడిపారు. ఒకరికొకరు తమ అనుభవాలు పంచుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు కలుసుకోవడం ఆనందదాయకమన్నారు. పాఠశాలలో విద్యార్థుల సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేసేందుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారన్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయుడు శేషయ్య, పీడీ యు.వెంకటరత్నంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం యు.మాధవరావు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండోతో శారీరక, మానసిక దృఢత్వం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఐ పాండురంగారావు

కొండపి: తైక్వాండో విద్యతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక ధైర్యం పెరుగుతుందని కొండపి పోలీస్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పాండురంగారావు పేర్కొన్నారు. మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో తైక్వాండో వేసవి శిక్షణా ముగింపు సభలో ఆదివారం సీఐ పాండు రంగారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు తైక్వాండో సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. పట్టణాల్లో ఎంతో ఖర్చు పెడితేగానీ విద్యార్థులకు దొరకని తైక్వాండో, స్పోకెన్ ఇంగ్లిష్ కోచింగ్‌ను గ్రామీణ విద్యార్థులకు ఉచితంగా నేర్పి ప్రోత్సహిస్తున్న మన ఊరివికాసం కార్యకర్తలు, ఎన్ఆర్ఐ దాతలు ధర్మవరపు ప్రసాద్, బెజవాడ వెంకట్‌ను సీఐ అభినందించారు. తైక్వాండో మాస్టర్ మారుతీప్రసాద్ మాట్లాడుతూ.. కట్టవారిపాలెం, కొండపి విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి బంగారు పతకం సాధించడం గర్వంగా ఉందన్నారు. మన ఊరి వికాసం కార్యకర్తలు సహకరిస్తే పరిసర గ్రామాలల్లోని విద్యార్థులకు కూడా తైక్వాండో శిక్షణ ఇస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మన ఊరి వికాసం కార్యకర్తలు పాల్గొన్నారు.

38 మంది కంటి ఆపరేషన్లకు తరలింపు



కంటి ఆపరేషన్ల కోసం తరలిస్తున్న వైద్యసిబ్బంది

పామూరు: వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా ఆదివారం మండలంలోని బొట్లగూడూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 174 మందికి సృజన, శ్రీనివాస్‌లు పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వారిలో 38 మందికి కంటిఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఆపరేషన్లు అవసరమైన అవ్వాతాతలకు, ఇతరులను శంకరకంటి వైద్యశాల ప్రత్యేక వాహనంలో గుంటూరు తరలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కంటి వెలుగు పథకం కంటిచూపు కోల్పోయిన వారికి ఆపరేషన్లద్వారా చూపు ప్రసాదించి వారిజీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి పేదల ఆరోగ్యానికి పెద్దపీటవేశారన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పోలె కోటేశ్వరరావు, నీలం ప్రత్యూష, మెడబలిమి నారాయణమ్మ, ఎస్.ధనమ్మ, ఆర్.శ్రీదేవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురంలో పేకాట శిబిరంపై ఎస్ఐ మాధవరావు ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.2850 నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలు ఆడుతున్నా, నాటుసారా తయారీ, అమ్మకాలు చేస్తున్న వారి సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

నాగులుప్పలపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి వారి నుంచి రూ.8,450 నగదుతో పాటు 26 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. టీ.అగ్రహారం గ్రామంలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.1,200, మట్టిగుంట గ్రామంలో 20 మందిని అదుపులోకి తీసుకుని రూ.7,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పెన్షన్‌దారులు ఈకేవైసీ వేయాలి

పెద్దదోర్నాల: ప్రభుత్వ పెన్షన్‌దారులు తప్పనిసరిగా ఈకేవైసీ వేయాలని ఏటీఓ కేవీ కెన్నడి తెలిపారు. ఆదివారం ఆయన ఈకేవైసీ గురించి మాట్లాడుతూ పెన్షన్‌దారుల ఫోన్ నంబర్‌కు ఆధార్‌తో అనుసంధానించుకోవాలని సూచించారు. అనుసంధానించిన 24 గంటల అనంతరం ఆధార్‌కార్డుతో మార్కాపురంలోని ట్రెజరీకార్యాలయంలోహాజరు కావాలనిసూచించారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్యవైశ్య మహిళా మండలి నాయకులు

ఉలవపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారం రోజులుగా నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్ష కార్యదర్శులు బాపనపల్లి సీతారావమ్మ, లక్ష్మీప్రసన్న బహుమతులు అందజేయగా, 57 మంది విద్యార్థులు హాజరయ్యారు. గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

● మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 12 వార్డు ఎస్సీ కాలనీ, కొండ కింద ఏరియాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను చైర్మన్ గఫార్‌కు విన్నవించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి నూతనంగా అదనపు ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని, నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వార నీటి సరఫరా అందచేస్తామని తెలిపారు. వార్డులో తక్షణ పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యతగా పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీరాం సతీష్, చింతంగుంట్ల కిషోర్ కుమార్, న్యాయవాది బుల్లా ప్రఫుల్లా కుమార్, గోనుగుంట్ల శ్యామ్యూల్, చింతంకుంట్ల రవి, ఆలూరి రోమా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యన్నారాయణస్వామి వ్రతం



సత్యన్నారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న అర్చకుడు

కందుకూరు: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పొట్టిశ్రీరాములు పెద్దబజారులో గల కోదండరామ స్వామి దేవాలయంలో ఆదివారం సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీరామ చంద్రాచార్యులు మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి ఆలయంలో సత్యన్నారాయణస్వామి సామూహిక వ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్రతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమాజ సేవ అలవర్చుకోవాలి



బాలోత్సవ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ చెన్నకృష్ణ

పామూరు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సమాజసేవ అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక మండల గౌరవాధ్యక్షుడు, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ తిరివీధి చెన్నకృష్ణ అన్నారు. స్థానిక డీవీ పాలెం పాఠశాలలో ఆదివారం సాయంత్రం 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరగనున్న బాలోత్సవం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చెన్నకృష్ణ మాట్లాడుతూ బాలోత్సవ్ కార్యక్రమంలో డ్యాన్స్, చిత్రలేఖనం, సైన్స్, గణితం, మ్యాజిక్స్, కవితలు, డ్రాఫ్టింగ్ మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమపిల్లలను బాలోత్సవ్‌లో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో క్యాంప్ నిర్వాహకురాలు సయ్యద్ షమ్మి, సీపీఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి, కె.శంకర్, యూటీఎఫ్ నాయకులు జవంగుల వెంకట్రావు, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి కళ్యాణం



శ్రీనివాసుడి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుడ్లూరు: మండల పరిధిలోని మూర్తింపేట గ్రామంలో ఆదివారం వెంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చారు. వేదపండితులు భక్తులకు తాళిబొట్టు చూపించి ఘనంగా కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు వసంతోత్సవం, ఎనిమిది గంటలకు ధ్వజావరోహణం నిర్వహించారు. కార్యక్రమంలో సాలిపేట సర్పంచ్ చాపల రమణయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి కల్యాణం



సీతారాముల విగ్రహాలకు అభిషేకం చేస్తున్న వేద పండితులు

పీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మిలో రాముల వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా గ్రామంలోని భక్తులు ప్రాతఃకాలమునే ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తెచ్చిన పాలతో సీతారాముల విగ్రహాలకు అభిషేకం చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం కనువిందుగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.

పిల్లలు అనంతమైన శక్తివంతులు

● ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు



పిల్లల పెంపకం తలిదండ్రుల పాత్ర అంశం మీద ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు

టంగుటూరు: చిన్న పిల్లలు అనంతమైన శక్తివంతులని, వారిని సరైన విధానంలో పెంచితే మనం ఊహించని అద్భుతాలు సృష్టిస్తారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని కందులూరు గ్రామంలో నిర్మల విద్యానికేతన్‌లో ఆదివారం పిల్లల పెంపకం–తలిదండ్రుల పాత్ర అనే అంశంపై శిక్షణ తరగతిలో ఆయన ప్రసంగించారు. పిల్లల మనసు తెల్లకాగితం లాంటిదని, మంచి ఆలోచనలు, అలవాట్లు, నమ్మకంతో వారిని విజేతలుగా తీర్చిదిద్దవచ్చన్నారు. పిల్లలను కులమతాలకతీతంగా రాజ్యాంగ పీఠిక అర్థమయ్యేలా బోధిస్తే వారు క్రమశిక్షణ కలిగి ఉండడమే కాకుండా బాధ్యాతయుత పౌరులుగా తయారవుతారన్నారు. పిల్లల మీద చదువును రుద్దడం సరైంది కాదని, వారిలోని తెలివితేటలను బయటకు తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. తలిదండ్రులు మారకుండా పిల్లలను మారాలని కోరుకోవడం వృథా ప్రయాస అవుతుందన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు సినిమా పాటలు నేర్పిస్తున్నారని, అవి కాకుండా స్ఫూర్తినిచ్చే పాటలు నేర్పించాలని సూచించారు. భావోద్వేగాలను అదుపులో ఉంచుకునే వారే జీవితంలో విజేతలుగా నిలుస్తారని స్పష్టం చేశారు. పనిచేసే రంగం మీద ఇష్టాన్ని పెంచుకోవాలని, ఆలోచనల మీద పట్టు సాధించాలని చెప్పారు. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలంటే మన జీవన విధానాన్ని పూర్తిగా మార్చుకోవాలని, సానుకూల దృక్పథాన్ని అలవరుచుకోవాలని చెప్పారు. సంతోషంగా జీవించడం అనేది మన చేతుల్లోనే ఉందని తెలిపారు. మార్కులు, ర్యాంకులు మాత్రమే కాకుండ విద్యార్థులను సంపూర్ణ వ్యక్తిత్వం కలిగినవారిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని శిక్షణకు అధ్యక్షత వహించిన నిర్మల విద్యానికేతన్ కరస్పాండెంట్ ఇండ్ల ఏసుపాదం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలాదేవి, జనవిజ్ఞాన వేదిక నాయకులు గయాజ్, ఉపాధ్యాయులు జాలాది మోహన్, సూరే వెంకటేశ్వరరెడ్డి, కొల్లి శ్రీనివాసరావు, పఠాన్ సాజిద్ ఖాన్, సామాజిక కార్యకర్త ఎంఏ సలార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

హనుమంతునిపాడు: మండలంలోని దాసళ్లపల్లి గ్రామంలో దోమలేటి ఒడ్డున వెలసిన అంకాలమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం సిడిమాను ఉత్సవం భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి కొర్ల బండి, కుంకుమ బండ్లు, గ్రామోత్సవం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం నిర్వహించారు.

నేడు లక్ష్మీ తిరుపతమ్మ ఆలయ వార్షికోత్సవం

కురిచేడు: స్థానిక శ్రీ కోనవల్లభరాయస్వామి కొండపై వేంచేసి ఉన్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ, అంకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం జరగనుంది. వార్షికోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివార్ల గ్రామోత్సవం చేయనున్నారు. అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.